## రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు మూసివేసి.. పేదల కడుపుకొడుతున్న వైసీపీ ప్రభుత్వం

### - వచ్చేది టీడీపీనే.. పేదల అందరి కడుపు నింపుతామ్ : తేదేపా నాయకులు


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న సామాన్యులు

ధర్మవరం క్రైం, అక్టోబర్ 3 ప్రభాతవార్త : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత తేదేపా ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసి పేదల కడుపు కొడుతోందని తేదేపా నాయకులు వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో కనుచూపు మేరలో అభివృద్ధి కనపడలేదని, అప్పులకుప్పగా రాష్ట్రాన్ని తయారు చేశారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వచ్చే ఆదాయంలో 35 శాతం వడ్డీలకే చెల్లించవలసి వస్తోందని ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం రోజున ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో గల ప్రభుత్వ ఆసుపత్రి పక్కనున్న అన్నా క్యాంటీన్ వద్ద తేదేపా నాయకులు పేదలకు ఉచిత భోజనం అందజేశారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి భోజనం తిన్నారు. ఈ సందర్భంగా తేదేపా నాయకులు మాట్లాడుతూ.. ఎన్ని అవాంతరాలు ఎదరైనా దాతల సహాయ సహకారంతో ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్ ద్వారా పేదలందరికీ ఉచిత భోజనం అందిస్తామని తెలుగు దేశం పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం పురుషోత్తం గౌడ్, నాగూర్‌హుస్సేన్, మాజీ జడ్పిటిసి మేకల రామాంజినేయులు, సనత్‌కుమార్ గుప్తా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెగిపోయిన ఈ బ్రిడ్జిలకు మోక్షం ఎప్పుడు


తెగిపోయిన బ్రిడ్జి

అగళి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మండలంలో నెల రోజుల క్రితం బ్రిడ్జిలు తెగిపోయాయి. అధిక వర్షంతో సువర్ణముఖినది అగళి చెరువు మరువ పారడం వల్ల బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. అగళి, ఇరిగేపల్లి బ్రిడ్జి ధ్వంసం అవడం మూలంగా గ్రామాల మధ్య రాకపోకలు తెగిపోయాయి. అదే విధంగా మధూడి, తొనసనపల్లి మధ్య ఉన్న బ్రిడ్జి ధ్వంసం కావడంతో అక్కడకూడా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆలూడి కొమరేపల్లి మధ్య బ్రిడ్జి ధ్వంసమైంది. అగళి, రామాపురం బ్రిడ్జి పాడవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిలు ధ్వంసం అవడంతో ఇతర మార్గాల ద్వారా ద్విచక్ర వాహనాల్లో వెళ్లి పనులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంకా నెల రోజులపాటు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి కావున వర్షాకాలం అనంతరం ఈ పనులను పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు నూతనంగా బ్రిడ్జిల నిర్మాణాలకు కోటి రూపాయలతో ప్రతిపాదనలను పంపి అవి సిద్దం అయ్యాయని, ఈ వర్షాకాలం పూర్తి అయిన వెంటనే రెండు మూడు పెద్ద వర్షాలు ఉన్నాయని అవి పూర్తి అయిన వెంటనే ఆ బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా అక్కడ రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

## ఎఫ్‌పి షాపుల్లో కందులు కంచికేనా..!

అగళి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : ప్రతినెలా రేషన్ షాపుల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యంతోపాటు కందులు, చెక్కెర తదితర వస్తువులను అందించాలి. అది ప్రత్యేకంగా దసరా పండుగ ఈ నెలలో జరుగుతుంది. ఆ పండుగ సందర్భంగా ఇచ్చే నిత్యావసరాల కన్నా ఒకటి రెండు అధికంగా పంపిణీ చేయాలి. కానీ ప్రతి నెలా బియ్యంతోపాటు కందులు, చెక్కెరను గత రెండు నెలలుగా కార్డు దారులకు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గత నెల, ఈ నెల కార్డు దారులకు తప్పనిసరిగా కందులు అందించాల్సి ఉండగా ఆ కందులు కంచికేనా.. అంటూ కార్డు దారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో బియ్యం, కందిబేడలు, చెక్కెర, వంట నూనె, మైదాపిండి, చింత పండు, ఉప్పు ఇలా బియ్యంతోపాటు అందించే వారు ఇప్పుడు కేవలం కార్డు దారులకు బియ్యం పంపిణీకేనా ఇది అని ప్రశ్నిస్తున్నారు. పండుగ నెలలోనైనా కందులను అందించక వాటిని కూడా కంచికి పంపించిన విధంగా పంపిణీ చేయలేదని ఇప్పటికైనా సంబంధిత పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని బియ్యంతోపాటు అందించే కంది,చెక్కెరను అందించాలని కార్డు దారులు కోరుతున్నారు.

## ఘనంగా అష్టమి వేడుకలు


వీరభద్ర స్వామిని అలంకరించిన దృశ్యం

అగళి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : నవరాత్రులలో భాగంగా 8వ రోజు అష్టమిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అగళి శంకరేశ్వర ఆలయం, మధూడి వీరభద్ర స్వామి ఆలయంలో స్వాములను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. మధూడి వీరభద్ర స్వామిని సోమవారం రోజు వ్యాగ్ర వాహన అలంకరణ చేశారు. అదే విధంగా కొల్హాపురి మహాలక్ష్మిని గ్రామంలో ఊరేగించారు. నర్సాంబూది రంగనాథస్వామిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. అగళి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవిని వివిధ రూపాల్లో అలంకరించి 8వ రోజు పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో నవమి సందర్భంగా వివిధ రూపాల్లో రంగురంగు పూలతో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు.

## శ్రీదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


దుర్గాదేవి అవతారంలో యల్లమ్మ అమ్మవారు

రామగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మండలంలోని వెంకటాపురంలోని యల్లమ్మ అమ్మవారు సోమవారం శ్రీదుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు లోక కంఠకుడైన దుర్గమాసురుడు అనే రాక్షసుడిని సంహారించి దుర్గతులను పోగొట్టి దుర్గగా వెలుగొందింది. దుర్గేదుర్గతినాశని అనే వాఖ్యం భక్తులకు శుభాలను కలుగజేస్తుంది. శరన్నవరాత్రులలో దుర్గాదేవి ఆర్చించడం వల్ల దుర్గతులను పోగొట్టి సద్గతులను ప్రసాదిస్తుంది.

## హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుపట్ల టిడిపి దీక్షలు


దీక్షలు చేస్తున్న టిడిపి నేతలు

గుత్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : ఆరోగ్య యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఎన్‌టి రామారావు పేరు తొలగించి నీచరాజకీయ బుద్ధితో వైఎస్‌ఆర్ పేరు నామకరణం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం టిడిపి ఆధ్వర్యంలో దీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి జిలాన్, మాజీ ఎంపిపి వీరేష్, మాజీ మార్కెట్‌యార్డుచైర్మన్ శ్రీనివాసయాదవ్, జిల్లా అధికారప్రతినిధి శ్రీకాంత్‌చౌదరి, గోవిందు, టౌన్‌బ్యాంకు కృష్ణ, నబీరసూల్, రామకృష్ణ , కంబయ్య, సురేంద్ర, నారపరెడ్డి, మస్తాన్, తదితరులు దీక్ష చేపట్టారు. హెల్త్ యూనివర్సిటీకి ఎన్‌టిఆర్ పేరు యదావిధంగా కొనసాగించేవరకు దీక్షలు విరమించమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు రవిశంకర్‌గౌడ్, బద్రివలి, నాయకులు దిల్‌కాశీనా, చెన్నకేశవులు, భాస్కరస్వామి, నిజాముద్దీన్, భరత్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


ఈశ్వర్‌నాయక్ మృతి చెందిన దృశ్యం

గుత్తి, అక్టోబర్ 3 ప్రభాత వార్త : పట్టంలోని చెర్లోపల్లి కాలనీలో నివాసం వుండే ఈశ్వర్‌నాయక్ (41) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఇతను ఆదివారం అర్ధరాత్రి గాయాలతో ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. అయితే అతని మృతి పట్ల భార్య ఉమాదేవి పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా మరొక సంఘటనలో రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న తొండపాడు గ్రామానికి చెందిన గంగాధర్ మృతి చెందాడు. అదేవిధంగా పట్టణంలోని దాసరికాలనీ నివాసం వుండే శ్రీవిద్య అనే యువతి క్రిమిసంహారకమందుసేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆయా సంఘటనలపై ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం దుకాణం ఏర్పాటుకు నిరసనగా ధర్నా


కాలనీవాసులు ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : పట్టణంలోని కర్నూల్‌రోడ్డులో మస్రో సత్రం సమీపంలో నూతనంగా సెబ్ అధికారులు మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతవాసులు ధర్నాకు దిగారు. మద్యం దుకాణం ఎదుట జాతీయ రహదారిపై బైటాయించి జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తగదని విమర్శించారు. వారికి మద్దతుగా పలు రాజకీయపార్టీలు భాగస్వామ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో వైకాపా ఆన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరాలు సెబ్ సిఐ గురునాథ్‌రెడ్డితో చర్చించారు. అక్కడ ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తరలించి గతంలో వున్న స్థానంలోనే ఏర్పాటు చేసేలా నిర్ణయించడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

## హంపన్నకు రైల్వేశాఖ ఘననివాళి


రైలు ఇంజన్‌కు హంపన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

గుత్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మహిళల మానసంరక్షణకై అమర వీరుడైన గూలిపాళ్యం హంపన్నకు రైల్వేశాఖ ఘన నివాళి అర్పించింది. రైల్వేగేట్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో హంపన్న అంగ్లేయుల బారి నుండి మహిళలను రక్షించేందుకు నిరాయుధునిగా పోరాడి తుపాకి గుండ్లకు బలయ్యాడు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రైల్వేడిజిల్‌షెడ్ డిఎంఇ రమేష్ ఆధ్వర్యంలో రైలు ఇంజన్ 40007కు హంపన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఆయన జీవితఘట్టాలను అందులో పొందుపరిచారు. రైల్వే శాఖ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

## శ్రీమహిషాసురమర్దినిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



గుత్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త : పట్టణంలో దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని సోమవారం శ్రీమహిషాసురమర్దినిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో బాబా ఉత్సవ విగ్రహాన్ని నవధాన్యాలతో అలంకరించారు. రేణుకా యల్లమ్మ దేవస్థానం, గుత్తి ఆర్‌ఎస్ శ్రీషిరిడిసాయి దేవాలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ఆలయాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు.

## వర్షం వస్తే అన్నీ తడిసిపోవాల్సిందే..!

### -చిన్నముష్టూరులో శిథిలమైన భవనంలో రైతు భరోసా కేంద్రం


రైతు భరోసా కేంద్రంపై పైకప్పుపై ప్లాస్టిక్ కవర్ కప్పిన దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 3 ప్రభాతవార్త : వర్షం వస్తే చాలు ఆ భవనంలోని ఎరువులు, పురుగుల మందులు ఇతరత్రా వస్తువులన్నీ తడిసిపోతుండటంతో రైతులు, ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. రైతులకు వారి గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు అన్ని సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం నిర్వహిస్తున్న పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వర్షం వస్తే చాలు కారుతోంది. దీంతో భవనం పైకప్పుతోపాటు లోపలి విభాగాల్లో ఎప్పుడూ టార్పాల్ కప్పి ఉంచాల్సి వస్తోంది. గ్రామంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం ప్రారంభమై దాదాపు ఏడాది కాలం కావస్తున్నా ఇప్పటికీ పూర్తీ కాకపోవడంతో రైతులకు మెరుగైన సేవలు అందడంలేదని చెప్పాలి. రైతులందరినీ సమావేశపర్చి వ్యవసాయంలో మెలకువలు తెలియజేసి వారిని చైతన్యపర్చేందుకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు రైతు భరోసా కేంద్ర నిర్మాణం త్వరితగతిన పూర్తి కావడానికి తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం పేరు మార్పు కుట్రపూరితం...

### - టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

గుంతకల్లు, అక్టోబర్ 03 ప్రభాతవార్త : రాష్ట్రంలో తలమానికంగా ఉన్న " ఎన్‌టిఆర్ వైద్య విశ్వ విద్యాలయం " పేరును మార్పుచేస్తూ తీసుకున్న వైకాపా ప్రభుత్వ నిర్ణయం కేవలం కుట్రపూరితమని టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గుంతకల్లు పురపాలక సంఘం కార్యాలయం సమీపంలో 3వరోజు టిడిపి ముస్లీమ్ మైనార్టీ శ్రేణులు రిలే నిరాహార ధీక్షలకు ఆయన హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న ఎన్‌టిఆర్ వైద్య విశ్వ విద్యాలయం పేరును ప్రస్తుత వైకాపా ప్రభుత్వ నిరంకుశపాలనకు కుట్రపూరితమైన చర్యలకు నిదర్శనంగా వైఎస్‌ఆర్ వైద్య విశ్వవిద్యాలయంగా మార్చడం రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి నేతృత్వంలోని వైకాపా ప్రభుత్వంకు తగదన్నారు. సదరు విశ్వవిద్యాలయంపై ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి తన మోసపూరితమైన వైఖరిగా వైకాపా పార్టీ ఆవిర్భావంలోనే పార్టీ పేరులో తన తండ్రి పేరు వైఎస్‌ఆర్ అంటూనే రాజకీయ లబ్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ ఎన్నికల సంఘం జాబితాలో " యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ పేరుతో నమోదు చేసిన తీరు ప్రజలను మోసగించిన తీరు బహిర్గతమొందన్న సత్యాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ఇలాంటి మోసాలు, కుట్రలు జగన్‌రెడ్డి పాలనలో సర్వసాధారణంగా మారిందని, రాబోవు రోజుల్లో ప్రజలు బుద్ధిచెప్పి రాష్ట్రం నుండి తరిమికొట్టే రోజులు దగ్గర పడుతుందన్న సత్యాన్ని గుర్తించాలని వైకాపా శ్రేణులకు హితవు చెప్పారు. వైఎస్‌ఆర్ అంటే దివంగతనేత రాజశేఖర్‌రెడ్డిగా గుర్తించాలా లేక పార్టీ పేరులో ఉన్న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీగా గుర్తించాలా ప్రప్రథమంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ధీక్షలో పాల్గొన్న వారిలో ముస్లీమ్ మైనార్టీ శ్రేణులు షేక్ ఫజులు, కొలిమి ఇస్మాయిల్,ఆటోఖాజా, రంజాన్,రహిమాన్,మహమ్మద్ రఫీక్‌లతో పాటు తిక్కస్వామి, బొట్టుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రికి పీడియాట్రీషన్, ఆర్థోపెడీషియన్

ఉరవకొండ, అక్టోబర్ 3 ప్రభాతవార్త : నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికు పీడియాట్రీషన్ శ్రీనివాస్, అర్థోపెడీషియన్ ఎల్లోజీలు అందుబాటులోకి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రుల రీ స్ట్రక్చరింగ్‌లో భాగంగా ఉరవకొండ ఆసుపత్రికి కొత్తగా ఈ అండ్ టీ స్పెషలిస్టు, కంటి డాక్టర్, అనస్తీషియన్, ఆర్థోపెడీషియన్, ఇద్దరు గైనకాలజిస్టులు, పీడియాట్రీషన్, సర్జన్ పోస్టులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పీడియాట్రీషన్, అర్థోపెడీషియన్ వైద్యులు బాధ్యతలు చేపట్టగా అల్ట్రా స్కానింగ్ శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ఆశబాను తిరిగి బాధ్యతలు చేపట్టారు. మిగిలిన వైద్యులు కూడా ఈనెలాఖరులోగా బాధ్యతలు చేపట్టనున్నారని తెలిపారు.

## దేశ రక్షణతో సమానమైన పుణ్యం, వ్రతం, యజ్ఞం మరొకటి లేదు..!

### -ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో వక్తలు

ఉరవకొండ, అక్టోబర్ 3 ప్రభాతవార్త : దేశ రక్షణతో సమానమైన పుణ్యం, వ్రతం, యజ్ఞం మరొకటి లేదని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉరవకొండలో వారం రోజులపాటు కొనసాగిన వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం సాయంత్రం పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండలం ఆవరణంలో జరుగగా విశ్రాంత ఎంపీడీఓ టి.గణేష్‌బాబు ముఖ్య అతిధిగా, వి.లక్ష్మణ్ ముఖ్య వక్తగా, విభాగ్ సంఘ చాలక్ కాకర్ల రంగయ్య, జిల్లా కార్యవహ సుదర్శన్, ఉరవకొండ కండ కార్యవహ వినోద్ తదితరులు అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 97 సంవత్సరాలుగా ప్రజల్లో దేశభక్తి క్రమశిక్షణ, సమైక్యత, సమరసత తదితర గుణాలను నిర్మాణం చేస్తూ దేశాన్ని జగద్గురు స్థానంలో నిలుపాలని కృషి చేస్తోందన్నారు. స్వయం సేవకులు వివిధ రంగాల్లో నిస్వార్థంగా పనిచేస్తూ భారతీయ జీవన విలువలను పునఃప్రతిష్టింపజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వారం రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన శ్రీ ఉద్భవలక్ష్మి అమ్మవారు


శ్రీ ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన శ్రీ ఉద్భవలక్ష్మి అమ్మవారు

ఉరవకొండ, అక్టోబర్ 3 ప్రభాతవార్త : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం ఆశ్వీయుజ మాసం శుద్ధ దుర్గాష్టమి సోమవారం అమ్మవార్లు వివిద రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన శ్రీ ఉద్భవలక్ష్మి అమ్మవారు శ్రీ ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని శ్రీ ఉరగాద్రి చౌడేశ్వరి చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా దర్శనమివ్వగా, శ్రీ దుర్గాభవాని, శ్రీ ఈశ్వరమ్మ ఆలయాలతోపాటు వెలిగొండ గ్రామంలోని శ్రీ భగళాముఖి ఆలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం మోదలు రాత్రి వరకు ఆయా ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించగా ఆలయ కమిటీలు అమ్మవార్ల దర్శనానికి అనుమతించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించండి

### -మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిను సన్మానించిన దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 3 ప్రభాత వార్త : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొ న్నారు. పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఇటీవల జరిగిన అంగన్‌వాడీ నియామకాల్లో ఉద్యోగాలు పొందిన పలువురు మాజీ ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేసి శాలువాకప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మార్చి మెనూ, పౌష్టికాహారం నాణ్యతను పెంచారని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మెన్ బోయ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, ఉప సర్పంచ్ జి.వన్నప్ప, వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

## జోడోయాత్రకు ఇన్‌చార్జ్‌గా నరసింహులుకు బాధ్యతలు


నరసింహులు (ఫైల్‌ఫోటో)

గోరంట్ల, అక్టోబర్ 3 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ చేపడుతున్న జోడోపాదయాత్రకు ఇన్‌చార్జ్‌గా పెనుకొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పాలసముద్రం నరసింహులుకు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పిసిసి చీఫ్ శైలజనాథ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ కెటి శ్రీధర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్‌గాంధీ జోడోయాత్ర ఆంధ్రప్రదేశ్‌లో వెళ్లనున్న నేపథ్యంలో ఆయన యాత్ర నిర్వహణ, ప్రజల తరలింపు వంటి కార్యక్రమాలకు నియోజకవర్గం కో ఆర్డినేటర్‌గా నరసింహులును నియమించినట్లు ఆయన తెలిపారు. రాహుల్‌గాంధీ చేపట్టబోవు ఈ యాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ట్రిబుల్‌ఐటికి ఎంపికైన గోరంట్ల విద్యార్థి రాఘవేంద్ర


రాఘవేంద్ర (ఫైల్‌ఫోటో)

గోరంట్ల, అక్టోబర్ 3 ప్రభాతవార్త : పట్టణానికి చెందిన బెస్త ప్రసాద్ కుమారుడు బెస్త రాఘవేంద్ర కొడిగెనహళ్లి పాఠశాలలో చదువుతూ ఇడుపులపాయలోని ట్రిబుల్‌ఐటికి ఎంపికైనట్లు తండ్రి ప్రసాద్ తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు సాధారణ వ్యాపారం ద్వారా జీవనం సాగిస్తున్న నేపథ్యంలో ఆ కుటుంబంలో విరబూసిన విద్యాకుసుమంలా రాఘవేంద్ర ట్రిబుల్‌ఐటిలో సీటు దక్కడం పట్ల కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాఘవేంద్రకు తోటి విద్యార్థులతో పాటు పట్టణ వాసులు అభినందనలు తెలిపారు.

## నేడు రొద్దంలో గడపగడప కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### -వైసీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య

రొద్దం, అక్టోబర్ 3 (ప్రభాతవార్త) మండలంలోని కోగిర ఎఆర్‌జిబి గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైసీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి పెనుకొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి శంకర్‌నారాయణ విచ్చేస్తున్నారన్నారు. కావునా ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు సభ్యులు, కోఆప్సన్ మెంబర్, సర్పంచులు, సింగిల్ విండో అధ్యక్షులు, పంచాయతీ కన్వీనర్లు, భూత్ కన్వీనర్లు వార్డు మెంబర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు హాజరు కావాలని వైసిపి మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య కోరారు.

## నాడు- నేడు కింద హాస్టల్ భవనంలో మౌలిక వసతులు


హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

అమరాపురం, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మడకశిర నియోకవర్గంలో ఏడు బిసి హాస్టల్స్‌ను నాడు- నేడు రెండవ విడత కింద అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు డివిజన్ బిసి వెల్ఫేర్ అధికారి రాజు కుళ్లాయప్ప తెలిపారు. మండల పరిధిలోని హేమావతి, వలస బిసి వెల్ఫేర్ హాస్టల్స్‌ను పరిశీలించి నాడు- నేడు పనులు చేపట్టడానికి సంబంధిత వెల్ఫేర్ ఆసిస్టెంట్ల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పరిశీలించారు. మడకశిర బిసి బాలికల హాస్టల్స్, వలస హేమావతి, కల్లుమర్రి, రత్నగిరి, రాళ్లపల్లి, అగళి హాస్టల్స్‌ను రెండవ విడత నాడు- నేడు అబివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో వార్డన్లు వెంకటేష్, వెంకటరమణ లు పాల్గొన్నారు.

## ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేసిన అధికారులు


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

అమరావురం, అక్టోబర్ 3 ప్రభాత వార్త : మండలంలోని ఎరువుల షాపులను హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ తనిఖీలు నిర్వహించారు. స్థానిక వ్యవసాయ అధికారి మంజునాథ్ సమక్షంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, అంజనాద్రీ ఎరువుల షాపులను సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఓ ఫామ్స్ ఎక్స్‌ప్రేడేట్ అయినందున ఎరువులు విక్రయించకుండా నిలుపు దల చేశామని అధికారులు తెలిపారు. దాదాపుగా 30.26 మెట్రిక్ టన్నుల ఎరువులను అమ్మకుండా నిలుపుదల చేశారు. సంబంధి సంస్థ ఓ ఫామ్స్ అమ్మకానికి మరులా అనుమతి పొందినప్పుడే అమ్మకానికి ఆవకాశం కల్పిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై ఓటు నమోదుపై అవగాహన


ఎమ్మెల్సీ ఓటర్లకు అవగాహన దృశ్యం

అమరావురం, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మండల కేంద్రంలో పట్టభద్రులు ఓటు నమోదుపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుండులమ తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డా. శ్రీనివాసమూర్తిల ఆదేశాల మేరకు మండల కోఆర్డినేటర్లు ఆగ్రహారం నవీన్‌కుమార్, ఆర్. జయకుమార్ లు స్థానిక నాయకులకు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. అమరాపురం పంచాయతీ టిడిపి అధ్యక్షులు నాగరాజు, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి దాదాపీర్, నాయకులు యోగానంద్, దాదు,రవి, ధనుంజయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు. పట్ట భద్రులు సత్వరమే ఓటరు నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని కోఆర్డినేటర్లు స్థానిక నాయకులకు తెలిపారు.

## రొద్దకాంబ ఆలయ కమిటీ ఎంపిక


రొద్దకాంబ ఆలయ కమిటీ ఎంపిక దృశ్యం

రొద్దం, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ రొద్దకాంబ దేవాలయ నిర్మాణ అభివృద్ధి కోసం సోమవారం సమావేశం నిర్వహించి గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. రొద్దకాంబ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులుగా ఆర్. భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్. రామకృష్ణ, బి. ఆదిశేషు, కోశాధికారిగా ఎన్. వేణుగోపాల్, రవి, కమిటీ సభ్యులు భక్తాదులు పి. చంద్రశేఖర్, ఆర్. భాస్కర్‌రావు, బి. నాగభూషణం ఏ. నరసింహులు బి. ముత్యాలప్ప, ఎన్. రామకృష్ణ, నరసింహులు ఉన్నారు.

## మానవ హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న గ్లోబల్ హుస్సేన్ అవేర్నెస్ అసోషియేషన్ నేతలు

ధర్మవరం, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మావన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని గ్లోబల్ హుస్సేన్ అవేర్నెస్ అసోషియేషన్ నేషనల్ ఛైర్మన్ కాసుల కోనయ్య, రాష్ట్ర డైరెక్టర్ ఇమామ్ పుట్టపర్తి ఛైర్మన్ నరేష్ ప్రకాష్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం సౌత్ జోన్ పరిశీలకులు నాయుని గారి నరసింహారెడ్డి ఆధ్వర యంలో మానవ హక్కుల అవగాహనపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ హక్కులను గూర్చి చర్చించడం ప్రజలకు జరుగుతున్న పేద కుల మత వర్గాలకు అతీతంగా అందరికీ న్యాయం అందించాలనేదే మా లక్ష్యమని వారు తెలిపారు. సంస్థలో పనిచేసే ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపరాఉ. సామాజిక న్యాయం పొందలేని వారికి కూడా పొందేటట్లు మా వంతు న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. మనమంతా ఒక కుటుంబ సభ్యులుగా ఉంటూ, భవిష్యత్తు తరాలకు కూడా న్యాయం కోసం పోరాడుతామని వారు హామీ ఇచ్చారు. ఈ అవగాహన సదస్సు అందరికీ ఉపయోగపడేలా ఆత్మీయ సమ్మేళనంచేయడం సంతోషదాయకమని తెలిపారు. ప్రతి ఒక్కరూ హక్కులె తెలుసుకుని పోరాడినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. భారత రాజ్యాంగంలో మానవునికి ఇచ్చిన హక్కులు ఎవరి దయాదాక్షిన్యాలపై ఆధారపడవలసిన అవసరం లేదని తెలిపారు. మనకు ఇచ్చిన హక్కులకు భంగం వాటిల్లితే.. పోరాటం వరకు తాము ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రైతు సంఘం ఛైర్మన్ నారాయణస్వామి, రీజనల్ ఛైర్మన్ పార్థసారథిరెడ్డి, రీజనల్ కార్యదర్శి మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులదుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

గుడిబండ, అక్టోబర్ 3 ప్రభాతవార్త : మండల పరిధిలోని మొరుబాగిల్ గ్రామంలో హిందూపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల దుకాణం నిర్వహణ, రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. అలాగే శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్టోర్స్‌లోఎరువుల నిల్వలు తేడా ఉన్నందున దాదాపు 3 లక్షల 54వేల విలువ చేసే దాదాపు 59 మెట్రిక్ టన్నుల యూరియాను వ ఇరకయించకుండా నిలుపుదల చేశారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ.. నకిలీ ఎరువులు అమ్మిన అధిక ధరలకు విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, వ్యవసాయ సహాయకులు నరసింహామూర్తి పాల్గొన్నారు.

